
14 నుంచి చంద్రబాబు పర్యటన



విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 14వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉత్తరాంధ్రలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయ నగరం జిల్లాల్లో రోజుకు మూడు సభల్లో ఆయన పాల్గొంటారు. 14వ తేదీన గాజువాక, చోడవరం, పాయకరావు పేటల్లో, 15న రాజాం, పలాస, టెక్కలి, 16న కురుపాం, గజపతినగరం, ఎస్.కోటల్లో ఎన్నికల సభల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

మహాత్మా జ్యోతీరావు పూలేకు నివాళి



మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఎ.మల్లికార్జున పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమాజానికి పూలే చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మోహన్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. - మహారాణిపేట

ఘనంగా రంజాన్



రంజాన్ పండుగను నగరంలో ముస్లిం సోదరులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. మసీదులు, ఈద్‌గాహ్‌ల వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదు ఇమామ్‌లు రంజాన్ సందేశాన్ని తెలియజేశారు. నమాజ్ ముగిసిన తరువాత ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



విద్యుత్ షాక్

జనంపై వైసీపీ సర్కారు బాదుడు

- ఐదేళ్ల క్రితంతో పోల్చితే బిల్లులు వంద నుంచి 200 శాతం పెరుగుదల
- పలుమార్లు చార్జీలు పెంపు
- ...ఇంకా ట్రూఅప్, తదితర పేర్లతో అదనపు భారం
- సాధారణ, మధ్య తరగతి ప్రజల గగ్గోలు
- వినియోగంలో మార్పు లేకపోయినా భారం పెరగడంపై ఆవేదన
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

"గడిచిన పదేళ్లుగా మా ఇంట్లో మూడు లైట్లు, రెండు ఫ్యాన్లు, ఒక టీవీ ఉన్నాయి. రెండు లైట్లు, ఒక ఫ్యాన్ మాత్రమే ఎక్కువగా వాడుతుంటాం. కానీ గతానికీ, ఇప్పటికీ విద్యుత్ బిల్లులో మాత్రం భారీ తేడా కనిపిస్తోంది. ఐదేళ్ల కిందట రూ.160 నుంచి రూ.200 మధ్యలో బిల్లు వస్తే...ఇప్పుడు రూ.400 నుంచి రూ.500 మధ్యలో వస్తోంది. గత నెల అయితే రూ.580 వచ్చింది. ఐదేళ్లలో రెట్టింపునకు మించి విద్యుత్ బిల్లు పెరిగిపోవడం దారుణం"

...ఇదీ నగర పరిధి మద్దిలపాలెంలో ఉంటున్న ప్రైవేటు ఉద్యోగి రామకృష్ణ ఆవేదన.

"కరెంట్ బిల్లు గతంలో రూ.250 వచ్చేది. గడిచిన కొన్నాళ్ల నుంచి రూ.400 నుంచి రూ.500 మధ్యలో వస్తోంది. రెట్టింపు అయ్యింది. విద్యుత్ చార్జీలతో ఇంట్లో ఫ్యాన్ వేయడానికి కూడా భయమేస్తోంది. నెలవారీ ఖర్చుల్లో కరెంట్ బిల్లుకు ఇంత మొత్తం చెల్లించాల్సి రావడం గతంలో ఎప్పుడూ లేదు."

- విశాలాక్షి నగర్‌లో నివాసం ఉంటున్న సత్యవతి

...రామకృష్ణ, సత్యవతి మాత్రమే కాదు. సాధారణ, మధ్య తరగతి ప్రజలంతా విద్యుత్ బిల్లుల భారంపై ఆందోళనతో ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్లలో విద్యుత్ బిల్లులు వంద నుంచి 200 శాతం వరకూ పెరిగిపోయాయి. ఇంట్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాల్లో తేడా లేకపోయినప్పటికీ బిల్లు లు మాత్రం భారీగా పెరిగిపోవడం పట్ల వినియోగ దారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పలుమార్లు విద్యుత్ చార్జీలను పెంచింది. ఇంకా ట్రూఅప్, తదితర పేర్లతో అదనపు భారాన్ని మోపింది. గతంలో విద్యుత్ బిల్లు రూ.300 వచ్చిన వినియోగదారులకు ఇప్పుడు రూ.600, అంతకంటే ఎక్కువ వస్తోంది. సాధారణ, మధ్య తరగతి ప్రజలు విద్యుత్ బిల్లుకు బడ్జెట్‌లో రూ.300కు మించి పెట్టేందుకు ఇష్టపడరు. అందుకు అనుగుణం గానే వినియోగం ఉండేలా చూసుకుంటారు. అయితే వినియోగం విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నా, కొన్నిసార్లు తగ్గించుకునే ప్రయ త్నం చేస్తున్నా బిల్లులు మాత్రం తగ్గడం లేదని వెంకోజీపాలెంలో నివాసం ఉంటున్న ఆర్.స్వప్న అనే గృహిణి ఆవేదన వ్యక్తంచేశారు. ఫ్యాన్లు వినియోగాన్ని చాలావరకు తగ్గిస్తున్నా మని, అయినా బిల్లు మాత్రం తగ్గడం లేద న్నారు. నెలవారీ పెరుగుతున్న విద్యుత్ బిల్లులు చూస్తుంటే ఫ్యాన్ వేసుకోవడానికి భయమేస్తోందని అక్కయ్యపాలేనికి చెందిన సుగుణ అనే గృహిణి వాపోయారు. గతంలో నెలకు రూ.250 బిల్లు వస్తే...ఇప్పుడు రూ.480 వరకు వస్తోందని, ఒక్కోసారి రూ.500 దాటిపోతోందని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తున్నా యూనిట్లు మాత్రం తగ్గడం లేదని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోవడం లేదని మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసే పైడినాయుడు ఆరోపించారు. ప్రజలపై భారం మోపే ముందు ప్రభుత్వాలు ఆలోచన చేయాలని, ఇతర ఖర్చులను విద్యుత్ చార్జీల రూపంలో సమకూర్చుకునేందుకు యత్నించడం వల్లే సమస్య తలెత్తుతోందని ఆయన వెల్లడించారు.

భారీగా పెరిగిన భారం

గడిచిన ఐదేళ్లలో వినియోగదారులపై విద్యుత్ భారం భారీగా పెరిగింది. నాడు రూ.250 విద్యుత్ బిల్లు చెల్లించిన వాళ్లు... నేడు రూ.400 నుంచి రూ.550 వరకు కడుతున్నారు. గతంలో రూ.450 విద్యుత్ బిల్లు చెల్లించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జగదీష్.. గడిచిన కొన్నాళ్లుగా రూ.750వరకు చెల్లిస్తున్నారు. ఇళ్లకే కాకుండా చిన్న చిన్న దుకాణాల నిర్వహణదారులకు కూడా విద్యుత్ బిల్లులు షాక్ ఇస్తున్నాయి. గతంలో కిరాణా దుకాణానికి విద్యుత్ బిల్లు రూ.1200 వచ్చేదని, గడిచిన కొన్నాళ్లుగా రూ.2 వేలు దాటుతోందని హెచ్‌బీ కాలనీలో షాపు నిర్వహిస్తున్న శివయ్య పేర్కొన్నారు. గత నెలలో రూ.3,300 బిల్లు చెల్లించినట్టు ఆయన పేర్కొన్నారు. ఇక, ఈ వేసవిలో వచ్చే బిల్లులు తలుచుకుంటే భయమేస్తోందన్నారు. ఏదిఏమైనా వైసీపీ ప్రభుత్వం సాధారణ, మధ్య తరగతి ప్రజలపై విద్యుత్ చార్జీల రూపేణా మోయలేని భారం మోపిందని పలువురు పేర్కొంటున్నారు.

దారుణంగా పెరిగిన కరెంట్ చార్జీలు



మా ఇంట్లో గడిచిన 12 ఏళ్లుగా మూడు ఫ్యాన్లు, టీవీ వాడుతున్నాం. ఇంట్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాల్లో మార్పులు ఏమీ లేవు. రోజువారీ విద్యుత్ వినియోగంలో కూడా తేడా లేదు. కానీ, గడిచిన ఐదేళ్లుగా విద్యుత్ బిల్లు భారీగా పెరుగుతూ వస్తోంది. ఆరేళ్ల కిందట రూ.250 బిల్లు వచ్చేది. ప్రస్తుతం రూ.750 నుంచి రూ.800 వరకు వస్తోంది. విద్యుత్ చార్జీలు పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. ఈ స్థాయిలో విద్యుత్ చార్జీలు ఎందుకు పెరుగుతున్నాయో చెప్పాలి. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం భారీగా పెరిగిపోతున్నాయి. ఎవరికి చెప్పినా స్పందన మాత్రం ఉండడం లేదు.

- అరసవెల్లి అప్పారావు, ప్రైవేటు ఉద్యోగి

మోయలేని భారం



విద్యుత్ చార్జీలు గత ఐదేళ్లలో పలుమార్లు పెంచడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడింది. మధ్యతరగతి ప్రజల రెండు గదుల ఇళ్లలో ఇప్పుడు కనీసం రెండు ఫ్యాన్లు, నాలుగు బల్బులు, ఒక ఫ్రిజ్, టీవీ, మిక్సీ ఉంటే నెలకు రూ.1,500 బిల్లు వస్తోంది. ఇప్పటికే నిత్యావసర సరకుల ధరలు పెరిగాయి. వాటితో పాటు పిల్లల చదువులకు భారీగా ఖర్చు చేయవలసి వస్తోంది. వీటికి కరెంటు బిల్లులు తోడవ్వడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల బతుకులు చితికిపోతున్నాయి. ఇదే సమయంలో ఆదాయం మాత్రం పెరగడం లేదు. విద్యుత్ చార్జీల పెంపు ప్రభావం అన్ని రంగాలపైనా పడుతోంది.

- బయపల్లి శ్రీరామమూర్తి, మధురవాడ

నాడు బిల్లు రూ.200, నేడు రూ.400...



గతంలో ఎప్పుడో గానీ రూ.200కు మించి కరెంట్ బిల్లు వచ్చేది కాదు. కొన్నాళ్ల నుంచి రూ.400 దాటుతోంది. ఏడాదిలో రెండు, మూడు నెలలు రూ.700 వస్తోంది. ఈ స్థాయిలో కరెంట్ చార్జీలు పెంపు దారుణం. విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై ప్రభుత్వం పెనుభారాన్ని మోపుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గడిచిన నాలుగేళ్లలోనే విద్యుత్ చార్జీలు ఎందుకు పెరిగాయో అర్థం కావడం లేదు. విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వం తగ్గించాలి. రోజువారీ పనులు చేసుకునే మాకు గడిచిన ఐదేళ్లలో ఆదాయం ఏమాత్రం పెరగలేదు. ఖర్చులు మాత్రం భారీగా పెరిగాయి. నిత్యావసర సరకుల తరువాత విద్యుత్ చార్జీల భారమే ఎక్కువగా ఉంది.

- కె.పార్వతి, గృహిణి, అక్కయ్యపాలెం

రైల్వే స్టేషన్‌లో ఇంకొన్నాళ్లు ఇబ్బందులే

- కుంగినచోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి తొలగింపు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలకు ప్రయాణికులు మరి కొన్నాళ్ల ఇబ్బందులు పడాల్సి వచ్చేలా ఉంది. నాలుగు రోజుల క్రితం దక్షిణం వైపు మూడో గేటుకు సంబంధించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోయిన సంగతి తెలిసిందే. రైల్వేస్టేషన్లలో ఇలాంటి ఘటనలు చాలా అరుదు. ఎక్కడో గానీ జరగవు. విశాఖపట్నం వంటి రద్దీ రైల్వే స్టేషన్‌లో ఇలాంటి ప్రమాదం జరగడం రైల్వే వర్గాలనే నివ్వెరపరిచింది. నాణ్యతాలోపం, నిర్వహణ లోపం ఉంటే తప్ప ఇలాంటివి చోటుచేసుకోవు. రైల్వేస్టేషన్ ఆధునికీకరించామని, నంబర్‌వన్ స్టేషన్‌గా అభివృద్ధి చేశామని చెప్పుకొనే అధికారులు ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం జరిగిందనే దానిపై ఇప్పుడు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తూ కుంగిందే తప్ప కూలిపోలేదని, అలా జరిగి

- పునరుద్ధరణకు మరికొంత సమయం

మిగిలిన ఫుట్ బ్రిడ్జిలను పరిశీలిస్తున్న అధికారులు

ఉంటే భారీ ప్రమాదమే సంభవించి ఉండేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోవడం వల్ల పెద్దగా ఇబ్బందులు ఉండవని, 24 గంటల్లో అన్నీ పునరుద్ధరిస్తామని ప్రకటించిన అధికారులు ఆ దిశగా సఫలీకృతం కాలేకపోయారు. రెండు రోజుల తరువాత 3, 4 ప్లాట్‌ఫారాల పైకి రైళ్లను రప్పించగలిగారు. కానీ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తక్షణమే పునర్నిర్మాణం చేయలేకపోయారు. దీనికి కనీసం పది రోజులకుపైగా సమయం పడుతుందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఈ బ్రిడ్జిని 3, 4 ప్లాట్‌ఫారాలపై పూర్తిగా కట్ చేసి **... మిగతా 6వ పేజీలో**

ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

- బ్యాంక్ కరెన్సీ చెస్ట్‌లో తుపాకీతో కాల్చుకుని అఘాయిత్యం



కానిస్టేబుల్ శంకరరావు (ఫైల్ ఫొటో)



ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ శంకరరావు

సీతంపేట, ఏప్రిల్ 11: స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) కానిస్టేబుల్ ఒకరు గురువారం తుపాకీ (సింగిల్ బెరల్ గన్)తో గుండెపై కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, సహ ఉద్యోగులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా వంగర మండలం కొట్టిస గ్రామానికి చెందిన పాలవలస శంకరరావు (35), భార్య శ్రావణి, ఇద్దరు పిల్లలు కుమారుడు కిశోర్, కుమార్తె జ్ఞానవితతో కలిసి మద్దిలపాలెం ప్రాంతంలోని పీతలవానిపాలెంలో నివాసం ఉంటున్నారు. శంకరరావు ఉద్యోగంలో అందరితో కలిసిమెలిసి ఉండేవారు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం ఐదు గంటలకు ద్వారకా నగర్‌లో గల ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు చెస్ట్‌లో సెంట్రీ డ్యూటీలో చేరారు. ఉదయం ఏడు గంటల సమయంలో తన చేతిలో ఉన్న ఎస్‌ఎల్‌ఆర్ వెపన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సంఘటనా స్థలానికి ఏసీపీ రాంబాబు, ద్వారకా స్టేషన్ సీఐ ఎస్.రమేష్, ఎస్ఐ ధర్మేంద్ర **... మిగతా 6వ పేజీలో**

డైట్ బిల్లులు పెండింగ్

బోధనాస్పత్రుల్లో రోగులకు ఆహారం సరఫరా చేస్తున్న వారికి ఆరు నెలలుగా చెల్లింపులు నిల్

- కేజీహెచ్, ఘోషా, విమ్స్, మానసిక వైద్యశాల, ఈఎన్‌టీ, చెస్ట్ ఆస్పత్రుల పరిధిలో రూ.4 కోట్ల బకాయిలు
- భోజనం నాణ్యతపై ప్రభావం

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బోధనాస్పత్రుల డైట్ కాంట్రాక్టర్ల (రోగులకు ఆహారం సరఫరా చేస్తున్నవారికి)కు ప్రభుత్వం భారీగా బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. చివరిసారి గత ఏడాది అక్టోబరులో బిల్లులను క్లియర్ చేసిన ప్రభుత్వం...ఆ తరువాత నుంచి రూపాయి కూడా విడుదల చేయలేదు. నగర పరిధిలో కేజీహెచ్, ఘోషా, విమ్స్, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధులు, మానసిక వైద్యశాల ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో ప్రతిరోజూ ఇన్‌పేషెంట్‌లుగా వందలాది మంది వైద్యం పొందుతుంటారు. వీరికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఉచితంగా పెడుతుంటారు. ఇందుకోసం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తారు. కాంట్రాక్టు దక్కించుకున్నవారు రోగులకు నాణ్యమైన భోజనం పెట్టాల్సి ఉంటుంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రెండు, మూడు నెలలకు ఒకసారి డైట్ బిల్లులు క్లియర్ చేస్తుండేది. అయితే, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డైట్ బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తూ ఉండడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. నెలలు తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టడం వల్ల రోగులకు అందించే భోజనం నాణ్యతపై కూడా ప్రభావం చూపుతోంది. గత ఏడాది అక్టోబరు నుంచి ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉందని ఆయా ఆస్పత్రుల అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సరకులు అరువుపై తీసుకొచ్చి రోగులకు ఆహారాన్ని అందిస్తున్నామని, డబ్బుల కోసం వ్యాపారుల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఎదురవుతోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

కేజీహెచ్‌కు రూ.2.28 కోట్లు పెండింగ్

కేజీహెచ్ డైట్ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం భారీగా బకాయిలను చెల్లించాల్సి ఉంది. ఈ ఆస్పత్రిలో ప్రతిరోజూ సుమారు 1,500 మంది ఇన్‌పేషెంట్‌లుగా ఉంటారు. వీరికి ఆహారాన్ని అందించినందుకుగాను నెలకు రూ.38 లక్షలు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. గడిచిన ఆరు నెలలకుగాను ఒక్క కేజీహెచ్‌కే రూ.2.28 కోట్లు ప్రభుత్వం నుంచి రావలసి ఉంది. అలాగే ఈఎన్‌టీ ఆస్పత్రిలో ప్రతిరోజూ 130 మంది ఇన్ పేషెంట్లుగా సేవలు పొందుతుంటారు. ఈ ఆస్పత్రికి నెలకు రూ.5 లక్షల వరకు బిల్లు అవుతోంది. గడిచిన ఆరు నెలలకు రూ.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఘోషాకు రూ.48 లక్షలు, విమ్స్ కాంట్రాక్టర్‌కు రూ.36 లక్షలు, మానసిక వైద్య శాల డైట్ **... మిగతా 6వ పేజీలో**



కేజీహెచ్‌లో ఆహారం సరఫరా (ఫైల్ ఫొటో)

జిల్లాలో ఎన్నికల పరిశీలకుల పర్యటన

- గాజువాక రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం, కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వివిధ కేంద్రాల సందర్శన

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా గురువారం జిల్లాలో పర్యటించారు. రాజమండ్రి నుంచి రోడ్డు మార్గాన జిల్లాకు చేరుకున్న ఆయనకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్‌లు అగనంపూడి వద్ద స్వాగతం పలికారు. అనంతరం మిశ్రా అగనంపూడి వద్ద ఏర్పాటుచేసిన తనిఖీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి గాజువాక నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి చేరుకుని కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ ఆయనకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన వివిధ కంట్రోల్‌రూమ్‌లను, అనుమతి జారీ **... మిగతా 6వ పేజీలో**



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న రామ్మోహన్ మిశ్రా. చిత్రంలో కలెక్టర్, సీపీ, జీవీఎంసీ కమిషనర్ ఉన్నారు

బడుగుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన జ్యోతీరావు పూలే

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ

మహరాణిపేట, ఏప్రిల్ 11: తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతీరావు పూలే 198 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావ్ పూలే బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి ఎంతో పాటు పడ్డారన్నారు. ప్రతీ ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సెల్ అధ్యక్షుడు టి విజయ్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాధవధార; సామాజిక ఉద్యమాల పితామహుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని కాంగ్రెస్ ఓబీసీ విభాగ ఛైర్మన్ మూల. వెంకటరావు పేర్కొన్నారు. జ్యోతిరావ్ పూలే జయంతిని గురువారం 51వవార్డులోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. 50వవార్డు టిడిపి వార్డు ప్రెసిడెంట్ సనపల.వరప్రసాద్ అధ్వర్యంలో జరిగిన జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నార్త్ నియోజకవర్గ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు. 51వవార్డు వైసీపీ కార్యాలయంలో కార్పొరేటరు రెయ్యి. వెంకటరమణ జ్యోతిరావ్ పూలేకి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గండిబాబ్జీ, నాయకులు

ఈపీడీసీఎల్ కార్యాలయంలో...

సీతమ్మధార: మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామచంద్ర ప్రసాద్, కార్పొరేట్ కార్యాలయం సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.పోటో 11ఆర్ఎస్-1 నంబరుతో ఉంది



మాధవధారలో నివాళులర్పిస్తున్న విష్ణుకుమార్ రాజు



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

డైట్ బిల్లులు పెండింగ్

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్‌కు రూ.30 లక్షలు, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రికి రూ.36 లక్షలు చొప్పున బిల్లులు చెల్లించాల్సి ఉంది. మొత్తం నగర పరిధిలోని బోధనాస్పత్రులకు నాలుగు కోట్ల రూపాయలకుపైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

మరో మూడు నెలలు కష్టమే

ప్రస్తుతం ఎన్నికల సీజన్ నడుస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకు డైట్ బిల్లులు చెల్లించే అవకాశం లేదు. ఇందుకు మరో మూడు నెలలు సమయం పడుతుంది. అంటే, మొత్తం తొమ్మిది నెలల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండనున్నాయి. సాధారణంగా ఎన్నికలకు ముందు బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేస్తుంది. ఈసారి వైసీపీ ప్రభుత్వం అలా చేయలేదు. పైపెచ్చు ఆరు నెలలుగా పెండింగ్‌లో పెడుతూ వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆస్పత్రులకు కలిపి సుమారు రూ.200 కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్టు చెబుతున్నారు.

ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. తమ బిడ్డకు ఎటువంటి సమస్యలు లేవని, భార్య శ్రావణి, పిల్లలతో ఎంతో అన్యోన్యంగా జీవితం సాగిస్తున్నట్టు శంకరరావు తల్లిదండ్రులు చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శంకరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కరెన్సీ చెస్ట్‌లో గల సీసీ కెమెరాల్లో శంకరరావు ఏ విధంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడో పుటేజీ పరిశీలించారు. క్లూస్ టీమ్ ద్వారా నమునాలను సేకరించారు.

జిల్లాలో ఎన్నికల పరిశీలకుల పర్యటన

... 5వ పేజీ తరువాయి

కేంద్రాలను తనిఖీ చేశారు. సింగిల్‌విండో డెస్క్, మీడియా మానిటరింగ్ సెంటర్, సోషల్ మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్, ఎక్స్‌పెండిచర్ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అధికారులతో మాట్లాడారు. ఎన్నికలకు జిల్లాలో చేపట్టిన చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఇంకొన్నాళ్లు ఇబ్బందులే

... 5వ పేజీ తరువాయి

తీసేశారు. కొత్తది వేయాలంటే..కింద బలమైన ఐరన్ పిల్లర్లు వేయాల్సి ఉంది. వాటితో పాటు పైన మళ్లీ సుమారుగా 20 మీటర్ల పొడవున వంతెన ఏర్పాటు చేసి, అది ఎంత బరువు కాస్తుందో పరిశీలించాల్సి ఉంది. అదే సమయంలో మిగిలిన పుట్ ఓవర్ బ్రిడ్జిల పనితీరు, సామర్థ్యం కూడా పరిశీలిస్తున్నారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ప్రమాదంతో రైల్వే స్టేషనలో జరుగుతున్న పనుల నాణ్యత, నిర్వహణపరమైన అంశాలపై తొలిసారిగా అనుమానాలు తలెత్తాయి. వాటిపైనే అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

జగదాంబ కూడలి, ఏప్రిల్ 11: వన్ టౌన్ బురుజుపేటలోని కనమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మంగళవారం నిర్వహించిన పంచామృతాభిషేక సేవల్లో 36 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఉదయం 7గంటల సమయంలో అర్చకులు ఉభయ దాతలతో సంప్రదాయబద్ధంగా సేవలు జరిపించారు. పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు. పతీ మంగళవారం నిర్వహించే పంచామృతాభిషేకసేవల్లో పాల్గొనదలచిన భక్తులు రూ. 1000రుసుం చెల్లించాలని ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అనం తరం అమ్మవారి స్వర్ణ ఆభరణాలు, చీరలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం వరకు భక్తులు అమ్మవారి దర్శనంకోసం క్యూలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు

బీజేపీ కార్యాలయాన్ని సందర్శించిన సీనియర్ నేతలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 11: గ్రేటర్ 26వ వార్డులో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని గురువారం పార్టీ సీనియర్ నాయకులు సందర్శించారు. బీజేపీ, జనసంఘంల నుంచి పని చేస్తున్న సీనియర్ నాయకులను ఉత్తర నియోజక వర్గం ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు విజయానికి దోహదపడేలా పని విభజన చేశారు. ఈ కార్యక్రమంలో సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగడమూడి నానాజీ, నగర మాజీ అధ్యక్షుడు టి.సుబ్బరామిరెడ్డి, నాయకులు ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, అప్పలకొండ, నీలాపు విజయానందరెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ ముఖ్యమంత్రిని ఇంటికి పంపించండి

» ఉత్తర కూటమి అభ్యర్థి విష్ణుకుమార్ రాజు



వైశాఖీ స్పోర్ట్సు పార్కులో వాకర్స్‌తో విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, ఏప్రిల్ 11: గతంలో ఎన్నడూ లేని విధంగా చెత్తపై పన్ను విధించిన అసమర్థ ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపించాలని మాజీ ఎమ్మెల్యే, ఉత్తర నియోజక వర్గం కూటమి అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు,కార్యకర్తలు, కుమార్తె శ్యామలా దీపికతో కలిసి 54వ వార్డు పరిధిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వైసీపీ పాలనలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై కక్ష్యపూరితంగా వైసీపీ నాయకులు వ్యవహరించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇటువంటి తుగ్లలక్‌లకు సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. గజపతి నగర్,ఐటీఐ జంక్షన్, సూర్యనగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ ప్రచారంలో జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు,గొర్లె అప్పారావు, ఆర్. రాంబాబు, పి.శ్రీను, కుట్టా కార్తీక్,స్రవంతి తదితరలు పాల్గొన్నారు.

వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ప్రచారం

మాధవధార; కూటమి అభ్యర్థి పెన్మెత్సవిష్ణుకుమార్ రాజు మురళీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం వాకర్స్‌ను, స్థానికులను, యువతను కలిసిన ఆయన తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఈసందర్భంగా కోరారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రగతి అధోగతి పాలయిందన్నారు. తిరిగి కూటమి నాయకుల పాలనతోనే గాడిన పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రచారంలో టీడీపీ నాయకులు సనపల.వరప్రసాద్, మురళీకృష్ణ తదితరులు, పార్కు కమిటీ సభ్యులు ఉన్నారు.

జీపీటీ ద్వారా పనిభారం తగ్గుదల



మాట్లాడుతున్న నిపుణుడు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 11: వ్యాపారం రంగంలోని జీపీటీ చార్ట్ అప్లికేషన్‌ను ఉపయోగించడం ద్వారా పనిభారం తగ్గుతుందని జూనియర్ ఇండియన్ ఛాంబర్ మాజీ నేషనల్ ప్రెసిడెంట్ కేవీ రత్నం అన్నారు. గురువారం ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్టీ ఫెడరేషన్, కే కుమారరాజా ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) టూల్స్ ఫ్యూచర్' అ నే అంశంపై సదస్సును ఓ హోటల్ నిర్వహించారు. ఈ సందర్భంగా చార్ట్ జీపీటీ అప్లికేషన్ విధివిధానాలు, కార్యక్రమంలో ఏపీ ఛాంబర్స్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డా.కె.కుమారరాజా, ఛైర్‌పర్సన్ ఆఫ్ విశాఖ జోన్ చిట్టూరి శ్రీనాథ్, వైస్ ఛైర్‌పర్సన్ ఎ.లీలారాణి, ఛైర్‌పర్సన్ ఆఫ్ వుమెన్స్ వింగ్ డా.గీత శ్రీకాంత్, జేసీఐ మాజీ అధ్యక్షుడు కె.శ్రీధర్, ఛాంబర్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 11: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, బీఎస్ లే అవుట్, ఎన్‌జీవోస్ కాలనీ, ఎంటీసీ పాలెం, శాంతినగర్, కైలాసపురం, నరసింహనగర్, రైతుబజారు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని, అందుకోసం వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'కోరాడ'పై సస్పెన్షన్ ఎత్తివేత

మహరాణిపేట, ఏప్రిల్ 11: భీమిలి నియోజక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కోరాడ నాగభూషణ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసినట్టు గురు వారం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ ఒక ప్రకట నలో తెలిపారు. ఇకపై నాగభూషణ్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

13న టాటా, ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఏప్రిల్ 11: సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో పవర్ బ్లాక్ పనుల చేపడుతున్నందున ఈనెల 13న టాటాలో బయలుదేరి ఎర్నాకులం వెళ్లే 18189 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 13న ఉదయం 5.15 గంటలకు టాటాలో బయలుదేరాల్సిన ఈ రైలు 9.15 గంటలకు బయలుదేరుతుంది.

బెల్లం వినాయకుడి ఆదాయం ఎంత?

» లెక్కింపునకు హైకోర్టు ఆదేశం

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

కేజీహెచ్ సమీపాన రెల్లి వీధి వద్ద నున్న బెల్లం వినాయకుడి గుడి వివాదం హైకోర్టులో నలుగుతోంది. తాజాగా ఆ గుడికి నెలకు ఎంత ఆదాయం వస్తున్నదో అంచనా వేసి తెలియజేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ ఆలయం అసలు పేరు బుచ్చి రామలింగేశ్వర ఆలయం. అక్కడ వినాయకుడి మహిమ వల్ల "బెల్లం వినాయకుడి గుడి"గా ప్రాచుర్యంలోకి వచ్చింది. బుధవారం రోజున అక్కడికి వెళ్లి ఏదైనా కోరుకొని, బెల్లం సమర్పిస్తామని వేడుకుంటే ఆ కోరిక తీరుతుందని భక్తుల విశ్వాసం. అలా భక్తుల ద్వారా ఆ ఆలయానికి బెల్లం భారీగా సమకూరుతోంది. ఆలయ ఆదాయానికి లెక్కలు లేవని రెండేళ్ల క్రితం దేవదాయ శాఖ అధికారులు ఈఓని నియమించారు. ఇందుకోసం బెల్లం వేలానికి ప్రకటన ఇవ్వగా పూజారి హైకోర్టును ఆశ్రయించారు. ఆలయాన్ని తాను సొంత నిధులతో అభివృద్ధి చేశానని, దీనికి భూములు, స్థిరాస్తులు లేవని విన్నవించారు. అందువల్ల ఆలయం ద్వారా వచ్చే ఆదాయం తనకే చెందుతుందని, దేవదాయ శాఖ వేలం వేయడానికి వీల్లేదని వాదించారు. దాంతో హైకోర్టు వేలంపై స్టే ఇచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం గత ఏడాది 298 జీఓ విడుదల చేసింది. దాని ప్రకారం ఏడాదికి రూ.5 లక్షల ఆదాయం కంటే ఎక్కువ ఉంటే ఆ ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తేవాలని, అంత కంటే తక్కువ ఉంటే అక్కడి వంశ పారంపర్య పూజారికే నిర్వహణ బాధ్యత ఇవ్వాలని ఆదేశించింది. ఆ ప్రకారం బెల్లం వినాయకుడి గుడి ఆదాయం ఎక్కువ కాబట్టి దేవదాయ శాఖ ముందుకు వచ్చింది. దానిపై కూడా పూజారి కోర్టులో కేసు వేశారు. ఆలయానికి రూ.5 లక్షల కంటే తక్కువే ఆదాయం వస్తున్నదని, నిర్వహణ బాధ్యత తనకే ఇవ్వాలని కోరారు. అయితే ఆదాయం ఎంతో లెక్క వేయడానికి ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ కోరింది. ఈ మేరకు గత నెల 18న ఒక ఆదేశం ఇచ్చింది. సూపరింటెండెంట్ స్థాయికి తగిన అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి, నెల రోజుల పాటు ఆలయం ఆదాయం ఎంత వస్తున్నదో కోర్టుకు సమర్పించాలని, దానిపై పూజారి కూడా సంతకం చేయాలని సూచించింది. దీనికి ఎనిమిది వారాల గడువు ఇచ్చింది. అయితే ఇదే సందర్భంలో దేవదాయ శాఖ మరో విషయం కోర్టుకు నివేదించింది. ప్రస్తుత పూజారి వంశ పార్యంపరంగా అక్కడ పనిచేస్తున్న అర్చకుడు కాదని, వారు వేరేగా ఉన్నారని, ఈయనకు ఆలయ బాధ్యతలు పూర్తిగా అప్పగించే అవకాశం లేదని పేర్కొంది. ఈ రెండింటిపైనా పూజారి మరో పిటిషన్ వేసినట్టు సమాచారం. కోర్టు ఏమి ఆదేశించనున్నదో తెలియదు. ఈలోగా స్పెషల్ ఆఫీసర్ నియామకం, ఆదాయం లెక్కింపు జరగాల్సి ఉంది. దీనికి కూడా ఆలయ వర్గాలు అడ్డం పడితే.. అక్కడ అధిక ఆదాయం వస్తున్నట్టుగానే అర్థం చేసుకోవాలని అక్కడికి వచ్చే భక్తులు అభిప్రాయపడుతున్నారు. పద్ధతి ప్రకారం ఆదాయం లెక్కకు అనుమతిస్తే.. అసలు విషయం తేలిపోతుందని, కోర్టు ఆదేశం ప్రకారం అందరికీ మంచే జరుగుతుందని అంటున్నారు. కానీ ఆదాయం లెక్క తేలనివ్వకుండా కొందరు అడ్డం పడతున్నారన్నట్టుగా ప్రచారం జరుగుతోంది.



ఆలయంలో సమర్పిస్తున్న బెల్లం దిమ్మలు

మానవాళి సంక్షేమమే ఖురాన్ ధ్యేయం

» రంజాన్ వేడుకల్లో ముస్లిం మతపెద్దలు



మాట్లాడుతున్న మతపెద్ద మౌలానా ఖాసిం రజ్వీ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 11: ఖురాన్ సమస్త మానవాళి సంక్షేమానికి దోహదపడుతుందని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో అల్లా ఆదేశాలతో జిబ్రాయిల్ దూత ద్వారా ఖురాన్ అవతరించినట్టు చెప్పారు. గురువారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్కు ఆవరణలో రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఈదుల్ పితర్ నమాజు మౌలానా ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలో నమాజును చేపట్టారు. అనంతరం ప్రపంచ శాంతి, మత సామరస్యం, సౌభాతృత్వం ఆకాంక్షిస్తూ ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం అధ్యక్షులు హైదర్ ఆలీసింకా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటం ద్వారా ఆకలిబాధను అర్థం చేసుకుని ఎదుటివారిపై ప్రేమ, అనురాగం పెంపొందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మహ్మద్ నజీర్, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కోశాధికారి హాజీ ఎస్కే అహ్మద్‌వలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ హాజీ రహతుల్లా, ఎండీ అస్లమ్, ఎస్‌ఏ మున్నీర్, మీర్ అబ్బాస్ హుస్సేన్, అమీర్‌జాన్, మహబూబ్ అవిబావ, మెహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.



రంజాన్ వేడుకల్లో దక్షిణంలో పోటీచేస్తున్న వైసీపీ అభ్యర్థి వాసుపల్లి, కూటమి అభ్యర్థి వంశీకృష్ణ

మురళీనగర్; మురళీనగర్ మసీదులో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మసీదు పెద్దలు అన్వర్ పాషా, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో వందలాదిగా ముస్లింలు వేడుకల్లో హాజరయ్యారు. ఇమామ్ వీరికి పవిత్ర సందేశం అందించారు. బర్మాక్యాంప్ కొండపై మసీదులో ముస్లింలు పేదలకు వస్త్రాలు, ధన సాయం చేసారు.

మర్రిపాలెం: రంజాన్ పర్వదినాన్ని మర్రిపాలెంలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ర ప్రత్యేక నమాజ్ ఆచరించారు. అనంతరం స్థానిక పెట్రోల్ బంకు సమీపంలోని ఈద్గావద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జాకీరుహుస్సేన్‌నగర్‌లో మసీదు ప్రత్యేక నమాజ్ ఆచరించిన అనంతరం ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భారీ తేడాతో రైల్వే ఎలక్ట్రికల్ టీఆర్‌డీ విజయం

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 11: వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజనల్ అంతర్ శాఖల క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ టీఆర్‌డీ 172 పరుగుల తేడాతో ఎలక్ట్రికల్ జనరల్‌పై ఘన విజయం సాధించింది. వాల్తేరు రైల్వే క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలి బ్యాటింగ్ చేసిన టీఆర్‌డీ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 231 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ అవినాష్ (50), వెంకట గణేష్ (63) హాఫ్ సెంచరీ చేయగా పిట్టా శ్రీనివాస్ (31), మధు (30), వెంకటకష్ణ (20) రాణించారు. ఎలక్ట్రికల్ జనరల్ బౌలర్ సాయి రిషిక్ మూడు వికెట్లు పడగొట్టాడు. భారీ లక్ష్య ఛేదనలో బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రికల్ జనరల్ 14.3 ఓవర్లలో కేవలం 59 పరుగులకు కుప్పకూలి ఓటమి పాలైంది. ప్రకాష్ (23) మినహా మిగిలినవారు పెవిలియన్ క్యూ కట్టారు. టీఆర్‌డీ బౌలర్లలో పిట్టా శ్రీనివాస్ నాలుగు వికెట్లు పడగొట్టగా, మధు రెండు వికెట్లు తీశాడు. ఆల్‌రౌండర్ ప్రతిభ కనబరిచిన పిట్టా శ్రీనివాస్ ప్లెయిర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును వాల్తేరు రైల్వే జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్ చేతుల మీదుగా అందుకున్నాడు.



ప్లెయిర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డునందుకుంటున్న శ్రీనివాస్

అన్నమాచార్య సంకీర్తనల పోటీలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 11: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి సందర్భంగా శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 19న నాలుగు విభాగాలుగా అన్నమాచార్య సంకీర్తన పోటీలు నిర్వహించనున్నట్టు శృతిలయ ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, సంగీతసంస్థలకు సంబంధించి వారు వయోపరిమితికి అనుగుణంగా ఈ పోటీలో పాల్గొనవచ్చునన్నారు. పోటీల్లో పాల్గొనేవారు పేరు, వయసు, స్కూల్ పేరు, ఆధార్ , వాట్సాప్ నెంబర్ 98498 29297కు తెలియజేయాలన్నారు. సబ్ జూనియర్స్ 6 నుంచి 15 సంవత్సరాలు, జూనియర్ 15 నుంచి25 ఏళ్ల వరకు పరిమితిమన్నారు. సీనియర్ విభాగంలో 25 నుంచి 40 సంవత్సరాలు, సూపర్ సీనియర్ 40 నుంచి 60 ఏళ్ల మధ్య వారు పాల్గొనాలన్నారు. దరఖాస్తులను మే 8 లోగా పంపించాలని కోరారు.

బీమా సొమ్ము కాజేయాలనే వివాహిత హత్య!

» కేసు ఛేదించిన పోలీసులు » ఇద్దరి నిందితుల అరెస్టు

సీతంపేట, ఏప్రిల్ 11: ద్వారకానగర్ రెండోలైన్‌లో నివాసం ఉంటున్న వివాహిత ఈశ్వరి మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఇన్సురెన్సు డబ్బులు కాజేయాలనే పథకం ప్రకారం హత్య చేసినట్టు తేలింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...ద్వారకానగర్ రెండో లైన్‌లో ఒక అపార్టుమెంట్‌లో చిట్టిబాబు కుమార్తె ఈశ్వరి... తన భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆమె కొద్ది కాలం క్రితం రైల్వే న్యూకాలనీలో ఒక బిరాయినీ పాయింట్‌లో పనిచేసేది. ఈ క్రమంలో అక్కడే పనిచేస్తున్న సయ్యాద్ ఆలీతో పరిచయం కలిగింది. ఆలీ అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే. ఈశ్వరి మధుమేహంతో బాధపడుతోంది. ఈ క్రమంలో సయ్యాద్ ఆలీతో 2019లో ఈశ్వరి పేరు మీద సయ్యాద్ ఆలీ బీమా కట్టించాడు. ఏడాదికి రూ.35 వేలు చొప్పున ప్రీమియం చెల్లిస్తున్నారు. ఇప్పటికి ఐదేళ్లు గడిచింది. ఈశ్వరి మధుమేహంతో బాధపడుతుండటంతో ఆమెను హతమార్చిబీమా డబ్బులు కాజేయాలని ఆలీ పథకం పన్నాడు. దీంతో ఈనెల 8వతేదీన ఈశ్వరి ఇంటికి వచ్చి ఇన్సూరెన్స్ బాండ్‌కి కొన్ని పేపర్లు సమర్పించాలని చెప్పి మాయమాటలతో ఆమెను బయటకు తీసుకువెళ్లాడు. ఈశ్వరిని అతను నివాసం ఉం టున్న ఇంటికి తీసుకువెళ్ళాడు.

అక్కడ ఇంట్లో ఎవరూ లేకుండా చేసి ఈశ్వరి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం హత్యను ప్రమాదంలో మృతి చెందినట్లు నమ్మించసాగాడు. ఈ క్రమంలో ఈశ్వరి మృతదేహంతో టూ టౌవన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి సయ్యాద్ ఆలీ తన స్నేహితుడు ఒడిశాకు ప్రాంతానికి చెందిన సబిత్ జితేందర్‌తో కలిసి ఆటోలో తీసుకువెళ్లాడు. అక్కడ ప్రమాదం జరిగినట్లు ఓ ఆసుపత్రికి తీసువెళ్లి ఇదే విషయం తెలిపారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందినట్లు ఈశ్వరి తండ్రి చిట్టిబాబుకు ఫోను చేసి ఆటోలో తీసుకువచ్చి ద్వారకానగర్ రెండో లైన్‌లో గల అపార్టుమెంట్ వద్ద వదిలి పారారయ్యాడు.

దీంతో ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ ఎస్.రమేష్ ఆధ్వ ర్యంలో కేసు నమోదు చేసిన ఎస్ఐ ధర్మేంద్ర హత్యకు పాల్పడిన సయ్యాద్ ఆలీను అదుపులో తీసుకొని విచారించి హత్య సహకరించిన సబిత్ జితేందర్‌ని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



టీడీపీలో చేరిన యువకులతో గణబాబు

గణబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

సింధియా, ఏప్రిల్ 11: పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, అభ్యర్థి పి.గణబాబు సమక్షంలో గురువారం సుమారు రెండు వందల మంది క్రీడాకారులు 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీకి చెందిన క్రీడాకారుడు మధు బాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షునిగా మధుబాబును గణబాబు నియమించారు. అనంతరం మధుబాబు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో గణబాబు గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఇదిలా ఉండగా 63వ వార్డు పరిధి జైయాంధ్ర కాలనీలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో కార్పొరేటర్ గల్లా చిన్నా మాట్లాడుతూ ఎన్నికల్లో గణబాబు గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.రాజు, కృష్ణ, శివ, నాని, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి. జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్‌లో పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గణబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూర్ల కాలనీ కూడలిలో టీడీపీ, బీజేపీ వార్డు నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గణబాబు లక్ష్మీనగర్ కొండవాలు, ఎఫ్-బ్లాక్, గ్యాస్ గోడౌన్, పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నాయకులు ఎలమంచిలి ప్రసాద్, పైడిరాజు, అనూష, జగన్, నరసింగరావు, పట్నాయిక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, ఏప్రిల్ 11: సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధి రాంపురం 11కేవీ ఫీడర్, గొరపల్లి, రాంపురం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా రాంపురం, సాధూ మఠం, హర్షవర్ధన్ నగర్, గంగమ్మపేట, గొరపల్లి, గవరపాలెం, వెల్ఫేర్ కళాశాల, కోట్నివానిపాలెం, గవరపాలెం, సంతపాలెం, గొల్లలపాలెం ప్రాంతాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

వైభవంగా దుర్గమాంబ పండుగ



పూజలందుకున్న దుర్గమాంబ

అగనంపూడి, ఏప్రిల్ 11: జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలోని అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయం వద్ద బారులుతీరారు. దుర్గమాంబను దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి ఆలయం వద్దకు తీసుకువచ్చి అనుపోత్సవాన్ని చేపట్టారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, కనకరాజు, గల్లా రాజు, మామిడి నరసింగరావు, గుర్రం శ్రీను, కె.సత్యారావు, పైడిరాజు, జగదీశ్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు :** కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 24, క్యారెట్ 34, దొండకాయలు 22, బంగాళదుంపలు 24, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 30, బరబాటి 24, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 42, ఆగాకర 110, పొటల్స్ 64, కీరదోస 22, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 60, దేముడుచిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	408
విజయనగరం	412
శ్రీకాకుళం	412

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	122
ఫారం ధర	--	142
విత్ స్కిన్	--	264
స్కిన్‌లెస్	--	274

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



కొత్తపాలెంలోని ఈద్‌గాహ్ వద్ద సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



గాజువాకలో ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు

ఘనంగా ఈదుల్ ఫిత్ర్

రంజాన్ సందర్భంగా పలుచోట్ల మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు

గోపాలపట్నం, ఏప్రిల్ 11: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో ముస్లింలంతా ఈదుల్ ఫిత్ర్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా గోపాలపట్నం పరిసరాల్లోని కొత్తపాలెం నూరానియా మసీద్, గోపాలపట్నం తాహా మసీదు, నందమూరినగర్ ఉమర్ సుల్తాన్ మసీదుల్లో ఈదుల్ ఫిత్ర్ నమాజ్‌ను ఆచరించడం కోసం ఉదయం నుంచే అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకున్నారు. మసీదు ఇమామ్ ధార్మిక ప్రసంగం ముగిశాక సామూహిక ఈద్ నమాజుల్లో పాల్గొన్నారు. కాగా కొత్తపాలెం గ్రామంలోని సంతోశ్‌నగర్ ఈద్‌గాహ్ వద్ద 89వ వార్డు ముస్లింలు ఈద్ నమాజ్ ఆచరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్: ముస్లింల పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని గాజువాకలోని అజీమాబాద్‌లో వున్న సున్నీ జామా మసీద్ నుంచి ముస్లిం సోదరులు భారీ ర్యాలీ చేపట్టి బీసీ రోడ్డులో ఉన్న ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ వారు సామూహికంగా నమాజ్ చేశారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ ఎంతో పర్వదినమని, ముస్లింలంతా ఐక్యంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. అలాగే ఇస్లాంపేట మసీదులో, స్టీల్‌ప్లాంట్ మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



వేపగుంటలో సామూహిక నమాజ్ చేస్తున్నముస్లింలు



ఆటోనగర్‌లోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఆటోనగర్: జీవీఎంసీ 70వ వార్డు టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు రెహమాన్ ఆధ్వర్యంలో ఈదుల్ ఫిత్ర్‌ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులు చేపట్టారన్నారు. అనంతరం సామూహిక నమాజ్‌లో అందరూ పాల్గొన్నారు. మత పెద్దలు వినిపించిన బోధనలను విన్నారు. అలాగే 86వ వార్డు ఫకీరుతఖ్యాలో, 87వ వార్డు వడ్లపూడిలో ముసింలు రంజాన్ వేడుకలను జరుపుకున్నారు. నమాజ్‌లు ముగిశాక ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల్లో ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఫిత్ర్‌ను జరుపుకున్నారు. పెదమడకలోని అబూబకర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మసీద్‌లో ముస్లింలు ప్రార్థలు చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దొేంద్ర, స్థానిక నాయకులు జి.అప్పారావు, బి.సత్యనారాయణ, అబ్దుల్, రహీం, హుస్సేన్, సిలారి, ఉస్మాన్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: రంజాన్ సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని ముస్లింలందరూ శ్రీహరిపురం మెయిన్ రోడ్డులో ఉన్న మసీదుకు ఉదయాన్నే చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా మసీదు వద్ద సందడి వాతావరణం నెలకొంది.

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు పరిధి వేపగుంట-చీమలాపల్లి రోడ్డులో ఉన్న మజ్జిద్ ఈ క్యూబా మసీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరూ ధర్మ మార్గాన్ని అనుసరించాలని మతపెద్దలు బోధనలు చేశారు. సాముహిక నమాజ్ చేశాక ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలువురు ముస్లింలు నిరుపేదలకు దానం చేశారు.



లక్ష్మీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆడారి మాలతి, తదితరులు



ప్రకాశ్‌నగర్‌లో ఓటర్లతో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ సోదరి రమాకుమారి

ఆనంద్‌కుమార్‌ను గెలిపించి ఆదరించండి

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి 'ఆడారి' సతీమణి మాలతి

గోపాలపట్నం, ఏప్రిల్ 11: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆదరించవలసిందిగా ఆయన సతీమని ఆడారి మాలతి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆమె గోపాలపట్నంలోని లక్ష్మీనగర్‌లో 92వ వార్డు కార్పొరేటర్ బెహరా స్వర్ణలత శివదేవి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మాలతి ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ఎన్నికల్లో ఆనంద్‌కుమార్‌తో పాటు విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీరాణిని గెలిపించాలని కోరారు. ఆనంద్‌కుమార్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తారన్నారు. ఆయా ప్రాంతాల్లో వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

61వ వార్డులో 'ఆడారి' సోదరి ప్రచారం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులో పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రచారాన్ని చేపట్టారు. కార్పొరేటర్ కొణతాల సుధతో కలిసి ఆమె ప్రకాశ్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించడంతో పాటు తన సోదరుడైన ఆనంద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్నప్పుడే ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టిన ఆనంద్‌కుమార్‌ను గెలిపిస్తే 'పశ్చిమ'ను మరింత అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు (వాసు), తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు



కూర్మన్నపాలెంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

మహాత్మా జ్యోతీరావు పూలేకు నివాళి

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని బుధవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నియోజకవర్గ కూటమి అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, నల్లూరు సూర్యనారాయణ, గోమాడ వాసు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన కార్యక్రమంలో కార్మిక నాయకులు వై.మస్తానప్ప, ఎన్నేటి రమణ, నమ్మి ప్రసాద్, పిట్టా రెడ్డి, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, వై.మస్తానప్పలు కోరారు. కూర్మన్నపాలెం కూడలిలోని పూలే విగ్రహానికి వారు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి, వయోజన విద్యా విధానానికి రూపకల్పన చేసిన మహనీయుడు పూలే అని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఆయన అనేక పోరాటాలు సాగించారన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, దొమ్మేటి అప్పారావు, జి.చింతయ్య, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్ధార్థనగర్ గ్రంథాలయంలో పూలే చిత్రపటానికి కాలనీ ప్రతినిధి బలిరెడ్డి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలనీ ప్రతినిధులు సుందరమూర్తి, సత్యనారాయణ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస సీడబ్ల్యూసీ ప్రాంగణంలో పూలే చిత్రపటానికి స్టీల్‌ప్లాంట్ ఓబీసీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కొలిపాక అప్పారావు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, బి.అప్పారావు, కరణం పైడిరాజు, రాము, టి.వెంకటరమణ, పైడికొండ, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: ఇక్కడి ఎస్సీ కాలనీలో రామ్-రాంజీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతీరావు పూలే జయంతిని నిర్వహించారు. సంఘం పెద్దలు కాకర పోలారావు, కాకర రమణ, ముప్పిడి వెంకటగిరి, పి.హరికృష్ణ, గౌతమ బుద్ధుడు విగ్రహం వద్ద పువ్వులు ప్రార్థన చేశారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అలాగే ప్రకాశ్‌నగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్దనున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి సీపీఐ 'పశ్చిమ' అధ్యక్షుడు కె.సత్యాంజనేయ, జి.రాంబాబు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. సెయింట్ ఆన్స్ కళాశాల ఆధ్వర్యంలో ఉన్న నవజ్యోతి మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలోనూ పూలే జయంతిని నిర్వహించారు.

7 వార్డులకు నిలిచిన తాగునీటి సరఫరా

మరమ్మతులకు గురైన పైపు లైన్ తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు

మల్కాపురం, ఏప్రిల్ 11 పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డులకు గురువారం తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అసలే వేసవి కాలం. రోజంతా తాగునీరు రాకపోవడంతో వారు నానాపాట్లు పడ్డారు. ఇప్పటి వరకు ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని పలువురు మహిళలు పేర్కొన్నారు. న్యాతయపాలెం నుంచి పారిశ్రామిక ప్రాంతానికి నీటి సరఫరా అయ్యే పైపు లైన్ బుధవారం మరమ్మతులకు గురవ్వడంతో గురువారం ఈ ఏడు వార్డులకు నీటి సరఫరా జరగలేదు. తాగునీటి సరఫరా విభాగం అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. భూగర్భంలో ప్రధాన వాల్వ్ లీకవ్వడం వల్లే నీటి సరఫరాకు అంతరాయం వాటిల్లినట్టు అధికారులు గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. శుక్రవారం నుంచి యథావిధిగా నీటి సరఫరా కావచ్చని ఏఈ మనోహర్ తెలిపారు. కాగా గురువారం నీటి సరఫరా బంద్ అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు తాగునీటి ట్యాంకర్లను పంపకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతు పనుల్లో నిమగ్నమైన సిబ్బంది

1,155వ రోజుకు చేరిన ఉక్కు పోరాట కమిటీ దీక్షలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 11: కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికాభివృద్ధి కుంటుపడిందని, సుమారు ఐదు లక్షల పరిశ్రమలు మూతపడ్డాయని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,155వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకునేంత వరకు తాము వెనక్కి తగ్గేదే లేదన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న బీజేపీకి తగిన సమయంలో బుద్ధి చెబుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రం వెనక్కి తీసుకునేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



అగనంపూడి చెక్‌పోస్టు వద్ద రామ్మోహన్ ఎన్నికల పరిశీలకులు మిశ్రా, తదితరులు

అగనంపూడి చెక్‌పోస్టును సందర్శించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు

కూర్మన్నపాలెం/గాజువాక, ఏప్రిల్ 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం అగనంపూడి చెక్‌పోస్టును గురువారం రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా, జిల్లా కలెక్టర్ ఎ.మల్లిఖార్జున్, సీపీ రవిశంకర్‌లు సందర్శించారు. చెక్‌పోస్టు వద్ద అధికారులు చేపడుతున్న చర్యలపై ఆరా తీయడంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇక్కడి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. మరింత కట్టుదిట్టంగా తనిఖీలను నిర్వహించాలని, రేయంబవళ్లు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వారి వెంట దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు, సిబ్బంది, తదితరులు ఉన్నారు. అనంతరం రామ్మోహన్ మిశ్రా తదితరులు గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న చర్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 11: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ అధికారులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఉక్కు యాజమాన్యానికి అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య బుధవారం వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లుగా పదోన్నతుల కల్పించకపోవడంతో ప్రమోషన్లు లేకుండానే ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారన్నారు. ప్రస్తుతంలో ప్లాంట్‌లో ఉన్నత స్థానాల్లో ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు లేరన్నారు.

ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తాం

విదసం ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న బూసి వెంకటరావు

గాజువాక, ఏప్రిల్ 11: దళితులపై హత్యాకాండ, శిరోమండనాలు, ప్రభుత్వ పథకాల రద్దు వంటి వాటిని చేసిన వైసీపీని గద్దె దింపుతామని విదసం ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు అన్నారు. గాజువాకలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుడైన సుబ్రహ్మణ్యాన్ని హత్య చేయించిన ఎమ్మెల్సీ అనంతబాబును పార్టీకి దూరం పెట్టలేదని, కోడి కత్తి కేసులో నిందితుడు శ్రీనివాసరావుకు బెయిల్ రాకుండా తప్పుడు పద్ధతులకు పోయారని, శిరోముండనం వంటి వాటిపై సీఎం జగన్ కనీసం పశ్చాతాపం చెందకపోవడం దారుణమన్నారు. వైసీపీ జెండా మోసిన దళితులపై దాడులు పెరిగాయని వాపోయారు. రాష్ట్రంలో వైసీపీ వలే బీజేపీ కూటమి కూడా ప్రమాదమని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, రిజర్వేషన్ల రద్దు వంటి వాటిని చేసిన బీజేపీని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమన, హరిబాబు, నిర్మల, శ్యాముల్‌కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో ఘనంగా మహిళా దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కూర్మన్నపాలెం: మహిళలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ దేవతలు ఉంటారని వడ్లపూడి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కారుమూరి మహేశ్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ బొండా జగన్ హాజరై కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలే మానవ జాతికి నిజమైన సంపద అని అన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలను ఘనంగా సత్కరించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు కె.సుజాత, ఎస్.రాధ, కె.విజయ, రత్నమాల, జి.లలిత, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సారంగి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 11: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఉక్కు ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సారంగి అన్నారు. స్టీల్ ప్లాంట్ సీడబ్ల్యూసీ-1లో చేపట్టిన ఉచిత హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. సీడబ్ల్యూసీ కార్యదర్శి డొక్కా నరసింగరావు మాట్లాడుతూ మాధవ్‌బాగ్ మల్టీ డిసిప్లినరీ కార్డియాక్ కేర్ క్లినిక్ అండ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు హెల్త్ చెకప్ కార్యక్రమం కొనసాగుతుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్.రావు, పలువురు కార్మిక నాయకులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన బాక్సర్లతో క్లబ్ ప్రతినిధులు

బాక్సర్లకు బంగారు పతకాలు

మల్కాపురం, ఏప్రిల్ 11: న్యూఢిల్లీ ఇటీవల జరిగిన 17వ జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ పోటీల్లో శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన ఎన్‌కేఎం రాజు బాక్సింగ్ క్లబ్‌కు చెందిన పలువురు బాక్సర్లకు బంగారు పతకాలు లభించాయి. కోచ్ భాస్కరరావు వద్ద శిక్షణ పొందిన పి.సాగర్ 60 కిలోలు, కె.తన్వీర్ 80 కిలోల విభాగంలో పసిడి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని క్లబ్ ప్రతినిధులు శ్రీహరిపురంలోని జీవీఎంసీ వాకింగ్ మైదానంలో ఘనంగా సత్కరించారు.

బడుగుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన జ్యోతీరావు పూలే

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ

మహారాణిపేట, ఏప్రిల్ 11: తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతీరావు పూలే 198 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావ్ పూలే బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి ఎంతో పాటు పడ్డారన్నారు. ప్రతీ ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సెల్ అధ్యక్షుడు టి విజయ్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాధవధార; సామాజిక ఉద్యమాల పితామహుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని కాంగ్రెస్ ఓబీసీ విభాగ చైర్మన్ మూల. వెంకటరావు పేర్కొన్నారు. జ్యోతిరావ్ పూలే జయంతిని గురువారం 51వవార్డులోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. 50వవార్డు టిడిపి వార్డు ప్రెసిడెంట్ సనపల.వరప్రసాద్ అధ్వర్యంలో జరిగిన జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నార్త్ నియోజకవర్గ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు. 51వవార్డు వైసీపీ కార్యాలయంలో కార్పొరేటరు రెయ్యి. వెంకటరమణ జ్యోతిరావ్ పూలేకి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గండిబాబ్జీ, నాయకులు

ఈపీడీసీఎల్ కార్యాలయంలో...

సీతమ్మధార: మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామచంద్ర ప్రసాద్, కార్పొరేట్ కార్యాలయం సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.పోటో 11ఆర్ఎస్-1 నంబరుతో ఉంది


మాధవధారలో నివాళులర్పిస్తున్న విష్ణుకుమార్ రాజు


పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

జగదాంబ కూడలి, ఏప్రిల్ 11: వన్ టౌన్ బురుజుపేటలోని కనమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మంగళవారం నిర్వహించిన పంచామృతాభిషేక సేవల్లో 36 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఉదయం 7గంటల సమయంలో అర్చకులు ఉభయ దాతలతో సంప్రదాయబద్ధంగా సేవలు జరిపించారు. పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు. పతీ మంగళవారం నిర్వహించే పంచామృతాభిషేకసేవల్లో పాల్గొనదలచిన భక్తులు రూ. 1000రుసుం చెల్లించాలని ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అనం తరం అమ్మవారి స్వర్ణ ఆభరణాలు, చీరలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం వరకు భక్తులు అమ్మవారి దర్శనంకోసం క్యూలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అలంకరణలో అమ్మవారు

బీజేపీ కార్యాలయాన్ని సందర్శించిన సీనియర్ నేతలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 11: గ్రేటర్ 26వ వార్డులో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని గురువారం పార్టీ సీనియర్ నాయకులు సందర్శించారు. బీజేపీ, జనసంఘంల నుంచి పని చేస్తున్న సీనియర్ నాయకులను ఉత్తర నియోజకవర్గం ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు విజయానికి దోహదపడేలా పని విభజన చేశారు. ఈ కార్యక్రమంలో సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగదమూడి నానాజీ, నగర మాజీ అధ్యక్షుడు టి.సుబ్బరామిరెడ్డి, నాయకులు ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, అప్పలకొండ, నీలాపు విజయానందరెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీటీ ద్వారా పనిభారం తగ్గుదల



మాట్లాడుతున్న నిపుణుడు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 11: వ్యాపారం రంగంలోని జీపీటీ చార్ట్ అప్లికేషన్‌ను ఉపయోగించడం ద్వారా పనిభారం తగ్గుతుందని జూనియర్ ఇండియన్ ఛాంబర్ మాజీ నేషనల్ ప్రెసిడెంట్ కేవీ రత్నం అన్నారు. గురువారం ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్టీ ఫెడరేషన్, కే కుమారరాజా ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ ఫ్యూచర్' అ నే అంశంపై సదస్సును ఓ హోటల్ నిర్వహించారు. ఈ సందర్భంగా చార్ట్ జీపీటీ అప్లికేషన్ విధివిధానాలు, కార్యక్రమంలో ఏపీ ఛాంబర్స్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డా.కె.కుమారరాజా, చైర్‌పర్సన్ ఆఫ్ విశాఖ జోన్ చిట్టూరి శ్రీనాథ్, వైస్ చైర్‌పర్సన్ ఎ.లీలారాణి, చైర్‌పర్సన్ ఆఫ్ వుమెన్స్ వింగ్ డా.గీత శ్రీకాంత్, జేసీఐ మాజీ అధ్యక్షుడు కె.శ్రీధర్, ఛాంబర్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ ముఖ్యమంత్రిని ఇంటికి పంపించండి

» ఉత్తర కూటమి అభ్యర్థి విష్ణుకుమార్ రాజు


వైశాఖీ స్పోర్ట్సు పార్కులో వాకర్స్‌తో విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, ఏప్రిల్ 11: గతంలో ఎన్నడూ లేని విధంగా చెత్తపై పన్ను విధించిన అసమర్థ ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపించాలని మాజీ ఎమ్మెల్యే, ఉత్తర నియోజక వర్గం కూటమి అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు,కార్యకర్తలు, కుమార్తె శ్యామలా దీపికతో కలిసి 54వ వార్డు పరిధిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వైసీపీ పాలనలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై కక్ష్యపూరితంగా వైసీపీ నాయకులు వ్యవహరించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇటువంటి తుగ్లలక్‌లకు సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. గజపతి నగర్,ఐటీఐ జంక్షన్, సూర్యనగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ ప్రచారంలో జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు,గొర్లె అప్పారావు, ఆర్. రాంబాబు, పి.శ్రీను, కుట్టా కార్తీక్,స్రవంతి తదితరలు పాల్గొన్నారు.

వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ప్రచారం

మాధవధార; కూటమి అభ్యర్థి పెన్మెత్సవిష్ణుకుమార్ రాజు మురళీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం వాకర్స్‌ను, స్థానికులను, యువతను కలిసిన ఆయన తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఈసందర్భంగా కోరారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రగతి అధోగతి పాలయిందన్నారు. తిరిగి కూటమి నాయకుల పాలనతోనే గాడిన పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రచారంలో టీడీపీ నాయకులు సనపల.వరప్రసాద్, మురళీకృష్ణ తదితరులు, పార్కు కమిటీ సభ్యులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 11: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, బీఎస్ లే అవుట్, ఎన్‌జీవోస్ కాలనీ, ఎంటీసీ పాలెం, శాంతినగర్, కైలాసపురం, నరసింహనగర్, రైతుబజారు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని, అందుకోసం వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'కోరాడ'పై సస్పెన్షన్ ఎత్తివేత

మహారాణిపేట, ఏప్రిల్ 11: భీమిలి నియోజక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కోరాడ నాగభూషణ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసినట్టు గురు వారం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ ఒక ప్రకట నలో తెలిపారు. ఇకపై నాగభూషణ్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

13న టాటా, ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఏప్రిల్ 11: సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో పవర్ బ్లాక్ పనుల చేపడుతున్నందున ఈనెల 13న టాటాలో బయలుదేరి ఎర్నాకులం వెళ్లే 18189 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 13న ఉదయం 5.15 గంటలకు టాటాలో బయలుదేరాల్సిన ఈ రైలు 9.15 గంటలకు బయలుదేరుతుంది.

మానవాళి సంక్షేమమే ఖురాన్ ధ్యేయం

» రంజాన్ వేడుకల్లో ముస్లిం మతపెద్దలు


మాట్లాడుతున్న మతపెద్ద మౌలానా ఖాసిం రజ్వీ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 11: ఖురాన్ సమస్త మానవాళి సంక్షేమానికి దోహదపడుతుందని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో అల్లా ఆదేశాలతో జిబ్రాయిల్ దూత ద్వారా ఖురాన్ అవతరించినట్టు చెప్పారు. గురువారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్కు ఆవరణలో రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఈదుల్ పితర్ నమాజు మౌలానా ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలో నమాజును చేపట్టారు. అనంతరం ప్రపంచ శాంతి, మత సామరస్యం, సౌభాతృత్వం ఆకాంక్షిస్తూ ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం అధ్యక్షులు హైదర్ ఆలీసింకా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటం ద్వారా ఆకలిబాధను అర్థం చేసుకుని ఎదుటివారిపై ప్రేమ, అనురాగం పెంపొందుతుందున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మహ్మద్ నజీర్, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కోశాధికారి హాజీ ఎస్‌కే అహ్మద్‌వలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ హాజీ రహతుల్లా, ఎండీ అస్లమ్, ఎస్ఏ మున్నీర్, మీర్ అబ్బాస్ హుస్సేన్, అమీర్‌జాన్, మహబూబ్ అవిబావ, మెహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.


రంజాన్ వేడుకల్లో దక్షిణంలో పోటీచేస్తున్న వైసీపీ అభ్యర్థి వాసుపల్లి, కూటమి అభ్యర్థి వంశీకృష్ణ

మురళీనగర్; మురళీనగర్ మసీదులో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మసీదు పెద్దలు అన్వర్ పాషా, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో వందలాదిగా ముస్లింలు వేడుకల్లో హాజరయ్యారు. ఇమామ్ వీరికి పవిత్ర సందేశం అందించారు. బర్మాక్యాంప్ కొండపై మసీదులో ముస్లింలు పేదలకు వస్త్రాలు, ధన సాయం చేసారు.

మర్రిపాలెం: రంజాన్ పర్వదినాన్ని మర్రిపాలెంలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ర ప్రత్యేక నమాజ్ ఆచరించారు. అనంతరం స్థానిక పెట్రోల్ బంకు సమీపంలోని ఈద్గావద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జాకీరుహుసేన్‌నగర్‌లో మసీదు ప్రత్యేక నమాజ్ ఆచరించిన అనంతరం ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బీమా సొమ్ము కాజేయాలనే వివాహిత హత్య!

» కేసు ఛేదించిన పోలీసులు » ఇద్దరి నిందితుల అరెస్టు

సీతంపేట, ఏప్రిల్ 11: ద్వారకానగర్ రెండోలైన్‌లో నివాసం ఉంటున్న వివాహిత ఈశ్వరి మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఇన్సూరెన్సు డబ్బులు కాజేయాలనే పథకం ప్రకారం హత్య చేసినట్టు తేలింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...ద్వారకానగర్ రెండో లైన్‌లో ఒక అపార్టుమెంట్‌లో చిట్టిబాబు కుమార్తె ఈశ్వరి... తన భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆమె కొద్ది కాలం క్రితం రైల్వే న్యూకాలనీలో ఒక బిరాయినీ పాయింట్‌లో పనిచేసేది. ఈ క్రమంలో అక్కడే పనిచేస్తున్న సయ్యాద్ అలీతో పరిచయం కలిగింది. అలీ అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే. ఈశ్వరి మధుమేహంతో బాధపడుతోంది. ఈ క్రమంలో సయ్యాద్ అలీతో 2019లో ఈశ్వరి పేరు మీద సయ్యాద్ అలీ బీమా కట్టించాడు. ఏడాదికి రూ.35 వేలు చొప్పున ప్రీమియం చెల్లిస్తున్నారు. ఇప్పటికి ఐదేళ్లు గడిచింది. ఈశ్వరి మధుమేహంతో బాధపడుతుండటంతో ఆమెను హతమార్చిబీమా డబ్బులు కాజేయాలని అలీ పథకం పన్నాడు. దీంతో ఈనెల 8వతేదీన ఈశ్వరి ఇంటికి వచ్చి ఇన్సూరెన్స్ బాండ్‌కి కొన్ని పేపర్లు సమర్పించాలని చెప్పి మాయమాటలతో ఆమెను బయటకు తీసుకువెళ్లాడు. ఈశ్వరిని అతను నివాసం ఉం టున్న ఇంటికి తీసుకువెళ్ళాడు.

అక్కడ ఇంట్లో ఎవరూ లేకుండా చేసి ఈశ్వరి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం హత్యను ప్రమాదంలో మృతి చెందినట్లు నమ్మించసాగాడు. ఈ క్రమంలో ఈశ్వరి మృతదేహంతో టూ టౌవన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి సయ్యాద్ అలీ తన స్నేహితుడు ఒడిశాకు ప్రాంతానికి చెందిన సబిత్ జితేందర్‌తో కలిసి ఆటోలో తీసుకువెళ్లాడు. అక్కడ ప్రమాదం జరిగినట్లు ఓ ఆసుపత్రికి తీసువెళ్లి ఇదే విషయం తెలిపారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందినట్టు ఈశ్వరి తండ్రి చిట్టిబాబుకు ఫోను చేసి ఆటోలో తీసుకు వచ్చి ద్వారకానగర్ రెండో లైన్‌లో గల అపార్టుమెంట్ వద్ద వదిలి పారారయ్యాడు.

దీంతో ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ ఎస్.రమేష్ ఆధ్వ ర్యంలో కేసు నమోదు చేసిన ఎస్ఐ ధర్మేంద్ర హత్యకు పాల్పడిన సయ్యాద్ అలీను అదుపులో తీసుకొని విచారించి హత్య సహకరించిన సబిత్ జితేందర్‌ని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డైట్ బిల్లులు పెండింగ్

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్‌కు రూ.30 లక్షలు, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రికి రూ.36 లక్షలు చొప్పున బిల్లులు చెల్లించాల్సి ఉంది. మొత్తం నగర పరిధిలోని బోధనాస్పత్రులకు నాలుగు కోట్ల రూపాయలకుపైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

మరో మూడు నెలలు కష్టమే

ప్రస్తుతం ఎన్నికల సీజన్ నడుస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకు డైట్ బిల్లులు చెల్లించే అవకాశం లేదు. ఇందుకు మరో మూడు నెలలు సమయం పడుతుంది. అంటే, మొత్తం తొమ్మిది నెలల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండనున్నాయి. సాధారణంగా ఎన్నికలకు ముందు బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేస్తుంది. ఈసారి వైసీపీ ప్రభుత్వం అలా చేయలేదు. పైపెచ్చు ఆరు నెలలుగా పెండింగ్‌లో పెడుతూ వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆస్పత్రులకు కలిపి సుమారు రూ.200 కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్టు చెబుతున్నారు.

ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. తమ బిడ్డకు ఎటువంటి సమస్యలు లేవని, భార్య శ్రావణి, పిల్లలతో ఎంతో అన్యోన్యంగా జీవితం సాగిస్తున్నట్టు శంకరరావు తల్లిదండ్రులు చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శంకరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కరెన్సీ చెస్ట్‌లో గల సీసీ కెమెరాల్లో శంకరరావు ఏ విధంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడో పుటేజీ పరిశీలించారు. క్లూస్ టీమ్ ద్వారా నమునాలను సేకరించారు.

జిల్లాలో ఎన్నికల పరిశీలకుల పర్యటన

... 5వ పేజీ తరువాయి

కేంద్రాలను తనిఖీ చేశారు. సింగిల్‌విండో డెస్క్, మీడియా మానిటరింగ్ సెంటర్, సోషల్ మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్, ఎక్స్‌పెండిచర్ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అధికారులతో మాట్లాడారు. ఎన్నికలకు జిల్లాలో చేపట్టిన చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఇంకొన్నాళ్లు ఇబ్బందులే

... 5వ పేజీ తరువాయి

తీసేశారు. కొత్తది వేయాలంటే..కింద బలమైన ఐరన్ పిల్లర్లు వేయాల్సి ఉంది. వాటితో పాటు పైన మళ్లీ సుమారుగా 20 మీటర్ల పొడవున వంతెన ఏర్పాటు చేసి, అది ఎంత బరువు కాస్తుందో పరిశీలించాల్సి ఉంది. అదే సమయంలో మిగిలిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిల పనితీరు, సామర్థ్యం కూడా పరిశీలిస్తున్నారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ప్రమాదంతో రైల్వే స్టేషనలో జరుగుతున్న పనుల నాణ్యత, నిర్వహణపరమైన అంశాలపై తొలిసారిగా అనుమానాలు తలెత్తాయి. వాటిపైనే అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

బెల్లం వినాయకుడి ఆదాయం ఎంత?

» లెక్కింపునకు హైకోర్టు ఆదేశం

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

కేజీహెచ్ సమీపాన రెల్లి వీధి వద్ద నున్న బెల్లం వినాయకుడి గుడి వివాదం హైకోర్టులో నలుగుతోంది. తాజాగా ఆ గుడికి నెలకు ఎంత ఆదాయం వస్తున్నదో అంచనా వేసి తెలియజేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ ఆలయం అసలు పేరు బుచ్చి రామలింగేశ్వర ఆలయం. అక్కడ వినాయకుడి మహిమ వల్ల "బెల్లం వినాయకుడి గుడి"గా ప్రాచుర్యంలోకి వచ్చింది. బుధవారం రోజున అక్కడికి వెళ్లి ఏదైనా కోరుకొని, బెల్లం సమర్పిస్తామని వేడుకుంటే ఆ కోరిక తీరుతుందని భక్తుల విశ్వాసం. అలా భక్తుల ద్వారా ఆ ఆలయానికి బెల్లం భారీగా సమకూరుతోంది. ఆలయ ఆదాయానికి లెక్కలు లేవని రెండేళ్ల క్రితం దేవదాయ శాఖ అధికారులు ఈఓని నియమించారు. ఇందుకోసం బెల్లం వేలానికి ప్రకటన ఇవ్వగా పూజారి హైకోర్టును ఆశ్రయించారు. ఆలయాన్ని తాను సొంత నిధులతో అభివృద్ధి చేశానని, దీనికి భూములు, స్థిరాస్తులు లేవని విన్నవించారు. అందువల్ల ఆలయం ద్వారా వచ్చే ఆదాయం తనకే చెందుతుందని, దేవదాయ శాఖ వేలం వేయడానికి వీల్లేదని వాదించారు. దాంతో హైకోర్టు వేలంపై స్టే ఇచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం గత ఏడాది 298 జీఓ విడుదల చేసింది. దాని ప్రకారం ఏడాదికి రూ.5 లక్షల ఆదాయం కంటే ఎక్కువ ఉంటే ఆ ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తేవాలని, అంత కంటే తక్కువ ఉంటే అక్కడి వంశ పారంపర్య పూజారికే నిర్వహణ బాధ్యత ఇవ్వాలని ఆదేశించింది. ఆ ప్రకారం బెల్లం వినాయకుడి గుడి ఆదాయం ఎక్కువ కాబట్టి దేవదాయ శాఖ ముందుకు వచ్చింది. దానిపై కూడా పూజారి కోర్టులో కేసు వేశారు. ఆలయానికి రూ.5 లక్షల కంటే తక్కువే ఆదాయం వస్తున్నదని, నిర్వహణ బాధ్యత తనకే ఇవ్వాలని కోరారు. అయితే ఆదాయం ఎంతో లెక్క వేయడానికి ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ కోరింది. ఈ మేరకు గత నెల 18న ఒక ఆదేశం ఇచ్చింది. సూపరింటెండెండ్ స్థాయికి తగిన అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి, నెల రోజుల పాటు ఆలయం ఆదాయం ఎంత వస్తున్నదో కోర్టుకు సమర్పించాలని, దానిపై పూజారి కూడా సంతకం చేయాలని సూచించింది. దీనికి ఎనిమిది వారాల గడువు ఇచ్చింది. అయితే ఇదే సందర్భంలో దేవదాయ శాఖ మరో విషయం కోర్టుకు నివేదించింది. ప్రస్తుత పూజారి వంశ పార్యంపరంగా అక్కడ పనిచేస్తున్న అర్చకుడు కాదని, వారు వేరేగా ఉన్నారని, ఈయనకు ఆలయ బాధ్యతలు పూర్తిగా అప్పగించే అవకాశం లేదని పేర్కొంది. ఈ రెండింటిపైనా పూజారి మరో పిటిషన్ వేసినట్టు సమాచారం. కోర్టు ఏమి ఆదేశించనున్నదో తెలియదు. ఈలోగా స్పెషల్ ఆఫీసర్ నియామకం, ఆదాయం లెక్కింపు జరగాల్సి ఉంది. దీనికి కూడా ఆలయ వర్గాలు అడ్డం పడితే.. అక్కడ అధిక ఆదాయం వస్తున్నట్టుగానే అర్థం చేసుకోవాలని అక్కడికి వచ్చే భక్తులు అభిప్రాయపడుతున్నారు. పద్ధతి ప్రకారం ఆదాయం లెక్కకు అనుమతిస్తే.. అసలు విషయం తేలిపోతుందని, కోర్టు ఆదేశం ప్రకారం అందరికీ మంచే జరుగుతుందని అంటున్నారు. కానీ ఆదాయం లెక్క తేలనివ్వకుండా కొందరు అడ్డం పడతున్నారన్నట్టుగా ప్రచారం జరుగుతోంది.


ఆలయంలో సమర్పిస్తున్న బెల్లం దిమ్మలు

భారీ తేడాతో రైల్వే ఎలక్ట్రికల్ టీఆర్‌డీ విజయం

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 11: వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజనల్ అంతర్ శాఖల క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ డీఆర్‌డీ 172 పరుగుల తేడాతో ఎలక్ట్రికల్ జనరల్‌పై ఘన విజయం సాధించింది. వాల్తేరు రైల్వే క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలి బ్యాటింగ్ చేసిన డీఆర్‌డీ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 231 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ అవినాష్ (50), వెంకట గణేష్ (63) హాఫ్ సెంచరీ చేయగా పిట్టా శ్రీనివాస్ (31), మధు (30), వెంకటకష్ణ (20) రాణించారు. ఎలక్ట్రికల్ జనరల్ బౌలర్ సాయి రిషిక్ మూడు వికెట్లు పడగొట్టాడు. భారీ లక్ష్య ఛేదనలో బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రికల్ జనరల్ 14.3 ఓవర్లలో కేవలం 59 పరుగులకు కుప్పకూలి ఓటమి పాలైంది. ప్రకాష్ (23) మినహా మిగిలినవారు పెవిలియన్ క్యూ కట్టారు. టీఆర్‌డీ బౌలర్లలో పిట్టా శ్రీనివాస్ నాలుగు వికెట్లు పడగొట్టగా, మధు రెండు వికెట్లు తీశాడు. ఆల్‌రౌండర్ ప్రతిభ కనబరిచిన పిట్టా శ్రీనివాస్ ప్లెయిర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును వాల్తేరు రైల్వే జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్ చేతుల మీదుగా అందుకున్నాడు.


ప్లెయిర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డునందుకుంటున్న శ్రీనివాస్

అన్నమాచార్య సంకీర్తనల పోటీలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 11: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి సందర్భంగా శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 19న నాలుగు విభాగాలుగా అన్నమాచార్య సంకీర్తన పోటీలు నిర్వహించనున్నట్టు శృతిలయ ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, సంగీతసంస్థలకు సంబంధించి వారు వయోపరిమితికి అనుగుణంగా ఈ పోటీలో పాల్గొనవచ్చునన్నారు. పోటీల్లో పాల్గొనేవారు పేరు, వయసు, స్కూల్ పేరు, ఆధార్ , వాట్సాప్ నెంబర్ 98498 29297కు తెలియజేయాలన్నారు. సబ్ జూనియర్స్ 6 నుంచి 15 సంవత్సరాలు, జూనియర్ 15 నుంచి25 ఏళ్ల వరకు పరిమితిమన్నారు. సీనియర్ విభాగంలో 25 నుంచి 40 సంవత్సరాలు, సూపర్ సీనియర్ 40 నుంచి 60 ఏళ్ల మధ్య వారు పాల్గొనాలన్నారు. దరఖాస్తులను మే 8 లోగా పంపించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎండాడ, ఏప్రిల్ 11 : ఎండాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రాజేష్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరహగిరినగర్, బీసీకాలనీ,శ్రీనివాసనగర్, ఎండాడ ఎస్సీ ఎస్టీ కాలనీ, దుర్గానగర్, శాందీపిణీనగర్, రాజీవ్‌నగర్, ముబారక్ కాలనీ, శాంతినగర్, రామాలయం ఏరియా, గణేష్ నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సింహాచలంలో..

సింహాచలం : సింహాచలంలోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి 12 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, విరాట్‌నగర్, సింహాద్రినగర్, బాలాజీ గార్డెన్స్, గోశాల కూడలి, గొల్లనారాయణపురం ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

అప్పన్న పెళ్లికి కదిరికి ఆహ్వానం

సింహాచలం, ఏప్రిల్ 11 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని ఈనెల 19న జరిగే స్వామివారి వివాహానికి ఆడపెళ్లివారి తరఫున రథసారధి కదిరి లక్ష్మణరావుకు ఆలయ సిబ్బంది అధికారిక లేఖను అందజేసి ఆహ్వానించారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం కదిరి లక్ష్మణరావు వంశస్తులకు సముద్రంలో అమ్మవారి విగ్రహం లభించగా దాన్ని తెచ్చి అప్పన్న ఆలయానికి అందజేశారని చెబుతారు. అప్పటి నుంచి జాలరి సామాజిక వర్గానికి చెందిన కదిరి కుటుంబీకులను ఆడపెళ్లి వారిగా స్వామివారి రథోత్సవానికి ఆహ్వానించడం ఆనవాయితీ. 19న జరిగే ఉత్సవంలో ముందుగా జరిగే రథోత్సవంలో రథానికి లక్ష్మణరావు సారధ్యం వహించనున్నారు.

'వైసీపీ తప్పుడు ప్రచారం'

తగరపువలస, ఏప్రిల్ 11 : మజ్జివలసలో జరిగిన టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సభపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందని జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు అన్నారు. గురువారం ఆయన తగరపువలస బైపాస్‌రోడ్డులో విలేకరులతో మాట్లాడారు. గంటా సభకు ఐదు వేలమంది రాగా వెయ్యి మంది మాత్రమే వచ్చారని ప్రచారం చేయడం సరికాదన్నారు. సభలో ఉపాధి కూలీలు ఉన్నారేమోనని అధికారులతో పరిశీలించారని చెప్పారు. తాము మొదటి నుంచీ తెలుగుదేశం సభ్యులమని, కొన్ని కారణాల వల్ల వైసీపీలో చేరి మళ్లీ సొంత గూటికి వచ్చామన్నారు. మూడు పార్టీలు మారి నాలుగో పార్టీలో ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు నీతులు మాట్లాడడం తగదన్నారు. తాము ఎవరినీ మోసం చేయలేదని, వైసీపీలో చేరి తామే మోసపోయామన్నారు. ఆయనతో పాటు గాడు తాతినాయుడు, నారాయణ ఉన్నారు.

హిందీ శిక్షణ తరగతులు ప్రారంభం

భీమునిపట్నం, ఏప్రిల్ 11 : పట్టణంలోని సుభాస్ రోడ్డులో వున్న ఆదర్శ హిందీ ప్రేమి మండలి కార్యాలయంలో గురువారం నుంచి హిందీ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ చెన్నైకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఈఏడాది సెప్టెంబరులో నిర్వహించే హిందీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, ప్రవేశిక, విశారద, ప్రవీణ పూర్వార్ధ, ఉత్తరార్థ పరీక్షలు రాయనున్న అభ్యర్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వివరాలకు 8985647419, 8985897419 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు.

నిత్యావసర సరకులు పంపిణీ

మధురవాడ, ఏప్రిల్ 11 : రంజాన్ సందర్భంగా ఆరో వార్డు గాయత్రీనగర్‌లో గోరే గురునాథ్ నిరుపేద ముస్లింలకు గురువారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అలరించిన శ్రీరాముడి పాటలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 11 : పాత వెంకోజీపాలెంలోని రామాలయంలో జరుగుతున్న నవరాత్రి వేడుకల్లో భాగంగా సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం భజన చేపట్టారు. శ్రీరామునిపై ఆలపించిన పాటలు ఆహూతులను మైమరింపజేశాయి. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆడారి పరదేశి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. కాగా తొమ్మిది రోజుల పాటు ఆలయంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు** : కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారేట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 150, బరబటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90,గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 110, పొటల్స్ 64, కీరదోస 22, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు(కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	408
విజయనగరం	412
శ్రీకాకుళం	412

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	122
ఫారం ధర	--	142
విత్ స్కిన్	--	264
స్కిన్‌లెస్	--	274

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..


భీమిలి ఈద్గాగాహ్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు


రంజాన్ వేడుకల్లో పాల్గొన్న గంటా శ్రీనివాసరావు

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

భీమునిపట్నం, ఏప్రిల్ 11 : పట్టణంలో రంజాన్ పండుగను ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన వారు బుధవారం రాత్రి నెలవంకను చూసి రంజాన్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా జామియా మసీదులో పేదలకు దానాలు చేశారు. అనంతరం, మినీ స్టేడియం వద్ద ఉన్న ఈద్గాగాహ్‌లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈసందర్భంగా మసీద్ ఇమామ్ ఎండీ నసీం అక్తర్ మాట్లాడుతూ ఖురాన్ విశిష్టత, రంజాన్ మాసం ప్రాముఖ్యతను వివరించారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో జామియా మసీదు పెద్దలు షేక్ అన్వర్ హుస్సేన్, షేక్ అబ్దుల్ నయీం, షేక్ అబ్దుల్ మతీన్, షేక్ అబ్దుల్ ఘని మర్కియార్, షేక్ యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న గంటా

సాగర్‌నగర్ : సాగర్‌నగర్ సమీపంలోని మసీదులో జరిగిన రంజాన్‌వేడుకల్లో గంటా శ్రీనివాసరావు పాల్గొని, నమాజ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి గొప్ప సందేశం రంజాన్ మాసం అని చెప్పారు. నెల రోజులు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టి ఎదుటివారి ఆకలి బాధను అర్థం చేసుకునే అవకాశం నేర్పింది రంజాన్ మాసంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవలోని పలు ప్రాంతాల్లోనూ రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్తాఫా కాలనీలోని మసీదు, ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న మసీదులోనూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.


పెద్దిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు


వైసీపీలో చేరిన తాళ్లవలస మహిళలతో ముత్తంశెట్టి

అభివృద్ధిని చూసి ఓటేయ్యండి : ముత్తంశెట్టి

ఆనందపురం, ఏప్రిల్ 11 : వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన పెద్దిపాలెం, లోడగలవానిపాలెం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని, పేదలకు సొంత గూడు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ మాయ మాటలు నమ్మొద్దని, అవినీతిరహిత పాలన అందించిన తమను ఆదరించి, అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముందుగా గ్రామానికి వచ్చిన ముత్తంశెట్టికి పెద్దిపాలెంలో కూరాకుల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పదవులిచ్చిన పార్టీకే వెన్నుపోటు

భీమునిపట్నం (రూరల్) : వైసీపీలో పలు పదవులు అనుభవించిన జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ పార్టీకి వెన్నుపోటు పొడిచారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం ఆయన తాళ్లవలస, గొల్లల తాళ్లవలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవకాశవాద రాజకీయ నాయ కులను ప్రజలు గమనించాలని, వారికి సరైన సమయంలో గుణపాఠం చెప్పాలన్నారు. తాను అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని, ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని చెప్పారు.తాళ్లవలస ఉప సర్పంచ్ రాజు పదవిని అనుభవించి పార్టీకి ద్రోహం చేయడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో గొలగాని సన్యాసిరావు, గొలగాని రాజు,ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పాసి అప్పలనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లవలస గ్రామస్థుల మద్దతు

తాళ్లవలస గ్రామానికి చెందిన పలువురు వైసీపీలో చేరారు.ఈమేరకు తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్థులు మాట్లాడుతూ ఉప సర్పంచ్ బుజ్జిరాజు ఒక్కరే తమ గ్రామం నుంచి టీడీపీలో చేరారని, బుజ్జి రాజు వార్డు మెంబరుగా, ఉప సర్పంచ్‌గా పదవులు పొంది వైసీపీకి ద్రోహం చేశారన్నారు. తామంతా అవంతికి అండగా వుంటామని, ఎన్నికల్లో వైసీపీకి గ్రామంలో అత్యధిక మెజారిటీ సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొలగాని సన్యాసిరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొలగాని రాజు,పాసి అప్పలనరసయ్య, నాగమణి, పల్ల బుజ్జి, హేమలయ్య, బొబ్బిలి మురళి, గొలగాని శ్రీను, అప్పలనారాయణ, పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో అన్ని వర్గాలకు మేలు

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, ఏప్రిల్ 11 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అభ్యర్థించారు. గురువారం ఆయన 10వ వార్డులోని రవీంద్రనగర్ కొండవాలుప్రాంతంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు.10వ వార్డు ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్, 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు.కార్యదర్శి కేతా సత్యన్నారాయణ. క్లస్టర్ ఇన్‌చార్జి రాజేష్, తూర్పు మహిళా నేతలు కె, కొండమ్మ, బీజేపీ నాయకులు కేవీ రమణ, జనసేన నాయకులు బండి రాజా రమేష్, అప్పారావు, సుధాకర్, మానిక్యాలరావు, సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


పదో వార్డులో ప్రచారం చేస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్ : జీవీఎంసీ 28వ వార్డులోని నెహ్రూ నగర్, జై సంతోషిమాత కాలనీతో పాటు పలు ప్రాంతాల్లోనూ టీడీపీ తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు గురువారం ప్రచారం చేశారు, ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారంటీ,జయహో బీసీ, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తూ.. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి నక్కా కనకరాజు, అన్నపూర్ణ, నక్కెళ్ల త్రినాద్, తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడికి మద్దతుగా...

వెంకోజీపాలెం : తూర్పు టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబును మళ్లీ గెలిపించాలని కోరుతూ 15, 16 వార్డుల్లో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. భవిష్యత్తుకు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో వెలగపూడిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, బంగార్రాజు, మొల్లి శంకర్, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, జి. అప్పన్న, పల్లా బాబు, శ్రీను, ఆర్. నూకరాజు, సత్యనారాయణ, రవికుమార్, నూకరాజు, ప్రకాష్, కర్రి పాల్గొన్నారు.


ఆరిలోవ : వేడుకల్లో పాల్గొన్న మేయర్ హరి వెంకటకుమారి

జ్యోతీరావు పూలే సేవలు ఆదర్శప్రాయం

వెంకోజీపాలెం : దేశ ప్రజలకు జ్యోతిరావు పూలే చేసిన సేవలు స్ఫూర్తిదాయమని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏయూ ఆవరణలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు జ్యోతీరావు పూలే

మధురవాడ, ఏప్రిల్ 11 : అణగారిన వర్గాలు కోసం పోరాడిన మహనీయుడు జ్యోతీరావుపూలే అని భీమిలి వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పూలే జయంతి సందర్భంగా గురువారం కారుషెడ్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూలే అణచివేతకు గురైన ప్రజల పక్షాన పోరాడి, వారిని సమాజంలో ఉన్నత శిఖరాలకు చేర్చడానికి ఎంతగానో కృషి చేసారని కొనియాడారు. అంతకముందు ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

ఆరిలోవ : సమాజానికి జ్యోతీరావు పూలే చేసిన సేవలు మరువలేమని మేయర్ హరి వెంకటకుమారి అన్నారు. గురవారం ఆమె తన క్యాంపు కార్యా లయంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కేక్ కోసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో రాజ్యసభ సద్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కేఆర్ పాత్రుడు, రాజబాబు, సత్తి మందారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో...

మధురవాడ : సామాజిక వేత్త జ్యోతీరావు పూలే సమాజ అభివృద్ధికి చేసిన కృషి వెల కట్టలేదని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 డీఈఈ పోలాకి శ్రీనివాసరావు అన్నారు.పూలే జయంతి సందర్భంగా గురువారం ఆయన మధురవాడ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బలగ సుధాకర్, జి. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పోలాకి శ్రీనివాసరావు


అమెరికా వెళుతున్న నేత్ర విద్యాలయం విద్యార్థులు

అమెరికా రొబోటిక్స్ పోటీలకు 'వారిజ' విద్యార్థులు

భీమునిపట్నం, ఏప్రిల్ 11 : అమెరికాలోని హౌస్టన్‌లో జరగనున్న ఎఫ్ఎల్ఎల్ (రొబోటిక్స్) పోటీలకు మంగమారిపేట వారిజ ఆశ్రమంలో వున్న నేత్ర విద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈమేరకు విద్యాలయం ప్రెసిడెంట్ పీఎస్ఎన్ రాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఇంగ్లండ్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో ఇండియా తరఫున అంధ విద్యార్థులు పోటీల్లో పాల్గొని విజయం సాధించారన్నారు. అలాగే చైనాలో జరిగిన అథ్లెటిక్స్‌లో ఇండియా తరఫున పాల్గొని విజయం పొందారన్నారు. జనవరిలో గోవాలో జరిగిన ఎఫ్ఎల్ఎల్ (రొబోటిక్స్) పోటీలో 5 దేశాలతో పాటు ఇండియాలోని ప్రముఖ నగరాల్లోని ఇంటర్నేషనల్ పాఠశాలల విద్యార్థులతో కూడా నేత్ర విద్యాలయం విద్యార్థులు పాల్గొని టీమ్ చాంపియన్ షిప్ సాధించారని తెలిపారు. ఈమేరకు అమెరికాలో జరిగే ఎఫ్ఎల్ఎల్ పోటీలకు అక్కడి నిర్వాహకులు ఆహ్వానించారన్నారు. విద్యాలయం నుంచి ధనలక్ష్మి, రవి, గాయత్రి, సుప్రియ, సం జయ్, స్పందనతో పాటు శిక్షణా సిబ్బంది 11 మంది అమెరికా ప్రయాణం కానున్నట్టు చెప్పారు.

రోడ్డుపై ఇసుక వ్యాపారం

మద్దిలపాలెం, ఏప్రిల్ 11 : స్థానిక చేపలబజార్ రోడ్డులో ఇసుక వ్యాపారం యథేచ్ఛగా జరుగుతోంది. రోడ్డుపై ఇసుక నిల్వ చేసి ఆటోల ద్వారా విక్రయిస్తున్నారు. చిన్న రోడ్డులో ఇసుక నిల్వ చేయడం వల్ల వాహనదారులు, స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇదే రోడ్డులో నెల కిందట పైపులైన్ల కోసం గోతులు తీశారు. పనులు పూర్తి చేసి గోతులు మాత్రం అసంపూర్తిగా పూడ్చి వదిలేశారు. అసంపూర్తిగా పూడ్చిన గోతులతో ఇబ్బంది పడుతున్న స్థానికులు ఇసుక నిల్వతో మరింత కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల నిర్మాణదారులు రోడ్డుపై భవన నిర్మాణ సామాగ్రి వేస్తే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వేలకు వేలు జరిమానా వేస్తారు. లారీలతో ఇసుక తీసుకొచ్చి రోడ్డు మీద స్టోరేజ్ చేసినా అటువైపు సచివాలయ, జీవీఎంసీ సిబ్బంది కన్నెత్తి కూడా చూడడం లేదు.


బజార్‌రోడ్డులో అమ్మకానికి ఉంచిన ఇసుక

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, ఏప్రిల్ 11 : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా పసిడి కుసుమార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్క పసిడి కుసుమంతో అర్చన జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తరువాత ఆదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు




రాజగోపురం వద్ద విదేశీయులు, కప్పస్తంభం పోలా భాస్కర్ దంపతులు

సింహాచలం, ఏప్రిల్ 11 : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఉన్నత విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్,పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘనంగా ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, అధికారులు ప్రసాదాలు అందజేశారు.

సింహగిరిపై విదేశీయులు

వరాహలక్ష్మీనృసింహస్వామిని రష్యాకు చెందిన కొందరు విదేశీయులు దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న వారు శ్రీఘ్రదర్శనం టికెట్లు తీసుకుని అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ శిల్ప సంపదను పరిశీలించారు. పలువురు భక్తులు వారితో సెల్ఫీలు తీసుకున్నారు.

'గంటా గెలుపు కాదు.. మెజారిటీ ముఖ్యం'


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పిల్లా మంగమ్మ

మధురవాడ, ఏప్రిల్ 11 : వచ్చే ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గెలుపు ఖాయమైందని, నాయకులు, కార్యకర్తలు మెజారిటీపై మాత్రమే దృష్టిసారించాలని 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ చెప్పారు. గురువారం ఆ వార్డులోని మిథిలాపురి వుడాకాలనీలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు గతంలో మంత్రిగా పని చేసినప్పుడు మధురవాడ పరిసరాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, వాటిపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. అలాగే వైసీపీ వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని చెప్పారు. సమావేశంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, కానూరి అచ్చుతరావు, కలివేల్పు సూరిబాబు, జనసేన నాయకులు నాగోతి నర్సినాయుడు, ఆర్. కృష్ణయ్య, బీజేపీ నాయకులు ప్రదీప్, వాసు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డులో గంటాకు మద్దతుగా ప్రచారం

ఎండాడ, ఏప్రిల్ 11 : జీవీఎంసీ 8వ వార్డు వరహగిరినగర్, ఎండాడ బీసీ కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు మద్దతుగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి గంటాకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సన్ హోటల్ మేనేజ్‌మెంట్ అధినేత దాస్రి ఆశ, వార్డు టీడీపీ అధ్యక్షుడు గోపి, జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దివీస్ ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 11 : చిప్పాడలోని దివీస్ కర్మాగారంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సత్యచంద్ర జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 1,110 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఉత్త రాంధ్ర జిల్లాలకు చెందిన ఏఎస్ రాజా, న్యూలైఫ్, ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు, రోటరీ బ్లడ్ బ్యాంక్, లైఫ్ కేర్, రెడ్‌క్రాస్ సంస్థలు దాతల నుంచి వెయ్యి యానిట్ల రక్తం సేకరించారు. దివీస్ డైరెక్టర్ దేవేందర్‌రావు, ఉపాధ్యక్షుడు ఎల్‌వీ రమణ, జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. సామాజిక సేవా విభాగానికి చెందిన పలువురు అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు



పద్మనాభం, ఏప్రిల్ 11 : ఎన్నికల నేపథ్యంలో ఎనిమిది సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపారు.గురువారం ఆయన ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద సీపీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల ఎన్నికల వేళ ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరిగినా సత్వరమే చర్యలు తీసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈమేరకు కొవ్వాడ, పెంట, మద్ది, బీఆర్ తాళ్లవలస, పాండ్రంగి, పొట్నూరు రెడ్డిపల్లి, గెద్దపేట గ్రామాల్లో కెమెరాలు ఏర్పాటు చేసి, నార్త్ జోన్ ఏసీపీతో పాటు తన ఫోన్‌కు వాటిని అనుసంధానం చేశామన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : ఏసీపీ

పద్మనాభం, ఏప్రిల్ 11 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని మధురవాడ నార్త్ జోన్ ఏసీపీ టి. సునీల్ కోరారు. గురువారం ఆయన సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన పొట్నూరు, రెడ్డిపల్లిలో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. ఎటువంటి కొట్లాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండాప్రతిఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలన్నారు. అనవసరమైన వివాదాల్లో తలదూర్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ శాంతియుత వాతావరణంలో జీవనం సాగిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.